# ముళ్ళబాటలో మల్లెపువ్వులు

జి. నరసింహమూర్తి

ప్రేమకన్నా త్యాగం చాలా విలువైనది ప్రేమించడంలో ఆరాధనఉంది, త్యాగంలోఆత్మీయత ఉంది. ప్రేమ ప్రతిఫలాన్ని ఆపేక్షిస్తుంది. త్యాగం ప్రతిఫలాన్నిస్తుంది. ప్రేమ పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహించే నది అయితే, త్యాగం నిర్మలమైన, నిశ్చలమైన సరస్సు వంటిది.

జీవితంలో ఒకరికొకరు త్యాగం చేసుకోవడంలో ఎంతైనా గొప్పతనం ఉంది.

స్త్రీ తనని ప్రేమించిన వ్యక్తికోసం, ఎటువంటి త్యాగమైనా చేయగలదు.

* * *

ఆకాశంలో చీకటి అలుముకుంటోంది. నక్షత్రాలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి గూటికి చేరుకోవాలనే ఆత్రుతతో తెల్లని కొంగలు బారులుతీర్చి వేగంగా వెడుతున్నాయి.

ఆ గదిలో చీకటిఛాయలు ఏర్పడుతున్నాయి. ఆ గుడ్డి వెలుతుర్లోనే 'విజయ' వ్రాసిన ఉత్తరం ఆత్రుతగా చదువుకుంటోంది 'శారద'

శారదా!

ఇన్నాళ్ళు నా ఉత్తరంకోసం అనుక్షణం ఎదురుచూస్తువుంటావని తెలుసు. ఏమిచేయను? పగిలిన హృదయంతో నీ 'విజయ' ఈ ఉత్తరం వ్రాస్తోంది. ఇది చదివేముందు నీవు ధైర్యం తెచ్చుకో. దీనినినీవు భరించలేవని తెలుసు. కాని నీకు వ్రాయక తప్పదు.

నీ జీవితానికి వెలుగు కురిపించి, జీవితాంతం నిన్ను పూలబాటపై నడపి, మరో నందనవనాన్నిర్మించుకోవాలనుకున్న మా అన్నయ్య ఇప్పుడు ఈలోకాన్ని చూడలేనివాడై పోయేడు. అన్నయ్య గుడ్డివాడై పోయేడు శారదా! నెలక్రితం కారు ప్రమాదంలో ఈ సంఘటన జరిగింది. ఈ విషయం నీ బ్రతుకులో మరోమలుపు తిప్పుతుందని తెలుసు. విధి నిర్ణయానికి మనం బానిసలం శారదా!...మనం అనుకున్నట్లుగా జరిగితే మనకు కావలసిందేముంది...నీవు నడిచే బాటలో పువ్వులేగాని ముళ్లుండవని నేను ఆశించాను కాని విధి ఎంత విచిత్రమైనది?

శారదా! నీకు వీలుంటే ఒకసారి వస్తావుకదూ! అన్నయ్య తనలో తాను ఎంతగానో కుమిలిపోతున్నాడు. నీ రాకైనా వాడికి కొంత ఊరటకలిగిస్తుందేమో!

ఎదురుచూస్తూ!

నీ 'విజయ'

ఆ ఉత్తరం పూర్తిచేయగానే అచేతనంగా వుండిపోయింది శారద. ప్రపంచమంతా తలక్రిందు లవుతున్నట్లుగా ఉంది. కళ్ళు తిరుగుతుండగా కుర్చీలో కూలబడింది. హృదయాంతరాలలోనుండి వస్తున్న కన్నీరు ఆమె కళ్ళను నింపివేసింది. లోకమంతా భయంకరమైన చీకటిగా గోచరించింది.

"అమ్మాయి శారదా! చీకటిపడింది. లైటైనా వేసుకోకుండా అలాగే కూర్చున్నావేమే" అమ్మమ్మ లోపలకువస్తూ అంది.

'అవును చీకటి పడింది ... నా జీవితమే ఒక పెద్ద చీకటైపోయింది అమ్మమ్మా' మనస్సులో మూగగా అరచింది.

భగవాన్ ఎందుకు నాపై నీకీకక్ష? నేనేంచేశా నని నాకీ శిక్ష? ఓడిపోయాను. తను మరలా రెండవ సారి జీవితంలో ఓడిపోయింది.

మోడువారిన తన జీవితాన్ని 'రవి' వచ్చి చిగు రింపచేశాడు. హృదయంలో నవ చైతన్యం కలిగేలా చేశాడు...అతనినే తన హృదయంలో ఆరాధిస్తూ త్వరలోనే తమ జీవితాలు ఏకమవుతాయి అనుకున్న సమయంలో, ఈ దురదృష్ట సంఘటన! తన జీవితమే అతనికి అంకితమైనప్పుడు ఈ విలువైన క్షణాలు జారవిడుచుకొని బ్రతికి వ్యర్థమనుకుంది. రవీ! నీకు నేను దూరంకాలేను...అని మనస్సులో గొణుగుకొని వెంటనే ఒక నిర్ణయానికి వచ్చినదానిలా లేచి, కళ్ళు తుడుచుకొని సూటుకేసులోనికి బట్టలు సర్దుకొని బయ టకు వచ్చింది.

అమ్మమ్మా...నేను...'విజయ' వాళ్ళ ఊరు వెళుతున్నాను రెండురోజులలో వచ్చేస్తాను'

'అదేమిటే శారదా! ఇప్పుడు ప్రయాణమా? నీకే మైనా మతిపోయిందా ; భోజనమైనా చేయకుండా ఏమిటీ ప్రయాణం?'

'టైంలేదు అమ్మమ్మా...విజయ నన్ను త్వరగా రమ్మనమని ఉత్తరం వ్రాసింది, ఈ బండికి అందు కోకపోతే నేనువెళ్ళి ప్రయోజనంలేదు. నీవు జాగ్రత్తగా ఉండు. నేను వెంటనేవచ్చేస్తానుగా! తలుపు వేసుకో' అంటూ వీధిలోకివచ్చి ఖాళీగావెడుతున్న రిక్షానుపిలిచి స్టేషన్‌కు పొమ్మంది.

స్టేషన్‌కు చేరుకొని టిక్కెట్టు తీసుకొని ప్లాట్ ఫారం మీదకు రాగానే ఎక్స్‌ప్రెస్ శబ్దం చేసుకుంటూ వచ్చింది. లేడీస్ కంపార్టుమెంట్‌లో ఒకమూల కిటికీ ప్రక్కగా కూర్చుంది.

గట్టిగా ఒక్కసారి కూతవేసి ఆ చీకటినిచీల్చు కుంటూ నెమ్మదిగా కదిలి వేగం అందుకుంది. ఎక్స్ ప్రెస్, పట్టాలు మారుతున్నప్పుడు ఎక్కువ శబ్దం అవుతూ కంపార్టుమెంటు అటూ ఇటూ ఊగుతోంది.

స్టేషన్‌లో వున్న లైట్లు దూరమైన కొలది చిన్నవై మాయమయ్యాయి.

బయటనుండి చల్లనిగాలి కిటికీలోనుండి వచ్చి ఆమెకు కొంత ప్రశాంతినివ్వగలిగింది...

తదియనాటి వెన్నెల మసకగావుంది. ఆ వెలు తురులోనే చెట్లన్ని వెనకకు పరుగెడుతున్నట్లుగా వున్నాయి.

అలాగే బయటకు చూస్తున్న శారదకు' ఆమె ఆలోచనలన్నీ గతంలోకి జారుకున్నాయి.

* * *

నల్లని మబ్బులతో ఆకాశమంతా నిండివుంది. సన్నని వర్షపుజల్లు పడుతుంటే, పందిరిమీద వున్న మల్లియలన్ని నవ్వుతున్నట్లుగా వున్నాయి.

'శారద' తలంటుకొని తెల్లని మల్లెపువ్వులాంటి వాయిల్‌చీర ధరించి అదేరంగుకల జాకెట్‌వేసుకుంది హాలులోకూర్చొని శరత్ వ్రాసిన "బడదీది" నవల చదువుతోంది. గుమ్మంవద్ద చప్పుడైతే తల ఎత్తి చూసింది.

ఫుల్ సూట్‌లో సూట్‌కేస్ పట్టుకొని నిలబడి వున్నాడు 'రవీంద్ర'. గాలికి ఎగురుతున్న వంకీల జుట్టును ఎడమ చేతితో వెనకకు నొక్కుకుంటూ " 'విజయ' వుందాండి నేను ఆమె అన్నయ్యను" అన్నాడు

ఆమె కంగారుగా లేచి నిలబడి 'రండి లోపల వుంది పిలుస్తాను' అంటూ లోపలకు వెళ్ళి 'విజయా! మీ అన్నయ్య వచ్చేరు' అంది

తిలకం దిద్దుకుంటున్న 'విజయ' పరిగెత్తినట్లు గానే బయటకు వచ్చి 'రా అన్నయ్య అక్కడే నిల బడి పోయేవేం? అమ్మ నాన్న అంతా బావున్నారా' అంది అతని చేతిలోని సూట్‌కేస్ అందుకొని తన గదిలోనికి దారితీసింది.

రవీంద్ర నవ్వుతూ 'అంతా బాగానే వున్నారు. నీ చదువు ఎలా వుంది?' అని అడిగేడు అక్కడే వున్న కుర్చీలో కూర్చొని.

"బాగానే చదువు కుంటున్నా" అని గుమ్మంవద్ద నిలబడిపోయిన శారదనుచూసి 'రా శారదా!...ఈమె నా క్లాస్‌మేట్ అన్నయ్యా, ఈ ఇంటివారమ్మాయి... ఈయన మా అన్నయ్య కాలేజీ లెక్చరర్' అని పరిచయం చేసింది.

శారద తలవంచుకొని 'నమస్కారమండి' అంది.

అపురూపమైన ఆమె సౌందర్యానికి మనోహరమైన ఆమె ముగ్ధత్వానికి ఆశ్చర్యపడుతూ "నమస్కారం" అన్నాడు.

నాలుగు కళ్ళు ఒక్కసారిగా కలుసుకున్నాయి.

"విజయా! మీరు మాట్లాడుతూ వుండండి. నేను వెళ్ళి కాఫీ పంపిస్తాను" అని లోపలకు వెళ్ళింది 'శారద'.

ఆమె వెళ్ళినవైపే చూస్తున్నాడు రవీంద్ర.

* * *

అప్పటికి రవీంద్ర వచ్చి నాలుగురోజులైంది.

ఆవేళ ఉదయం రవీంద్ర, విజయ కాఫీలు త్రాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. శారద లోపలకు వెళ్ళబోయి తనగురించే మాట్లాడుకోవడం వలన గుమ్మంవద్ద ఆగిపోయింది.

రవీంద్ర అంటున్నాడు "విజయా! నీ స్నేహితురాలు జీవితంలో ఏదో కోల్పోయినదానిలా, ఎప్పుడూ మౌనంగా వుంటుందేం?"

"నీవన్నది నిజమే అన్నయ్యా! ఆమె దుఃఖజీవి..."

"అంటే"

"శారదకు చిన్నప్పుడే భర్తపోయేడు"

"నిజమా!" ఎక్కడో పిడుగు పడినట్లయింది.

అంతవరకు నిలబడి వున్న తను తూలిపడబోయింది. ఈ రహస్యం ఎవ్వరికీ చెప్పకుండా వుండేటట్లు ఒట్టు వేయించుకుంది. కాని ఇప్పుడు విజయ వాళ్ళన్నయ్యకు చెప్పివేస్తుంటే ఆమె హృదయం మూగగా రోదించింది.

రవీంద్ర లేచి కిటికి వద్దకు వెళ్ళి శూన్యంలోనికి చూస్తున్నాడు. అతని మనస్సులో చెప్పలేని సంఘర్షణ బయలుదేరింది.

విజయ నెమ్మదిగా చెప్పుతోంది.

"చిన్నప్పుడు పెద్దల బలవంతంమీద ఆమెకు పెళ్ళి అయింది. కాని ఆమె తలలోని పువ్వులు వాడకముందే ఆమె భర్త హఠాత్తుగా చనిపోయేడు. ఇదే దిగులుతో ఆమె తల్లిదండ్రులు ఒకరి తరువాత ఒకరు ఈలోకాన్ని వదలి వెళ్ళిపోయేరు. ఎవరు లేని ఏకాకి అయింది...ఆ సమయంలో ఆమెకు వాళ్ళఅమ్మమ్మ తప్పించి ఎవ్వరూలేరు ఆమె శారదను చేరదీసింది. పెంచి పెద్దచేసి చదివిస్తోంది. గతాన్నంతా మరచి తన జీవితాన్ని మరో మలుపులోనికి త్రిప్పుకుని జీవిస్తోంది.."

కొన్ని క్షణాలు భారంగాను, బరువుగాను గడిచేయి...

రవీంద్ర ఇటు తిరిగి "మరలా ఆమె పెళ్ళి చేసుకోవచ్చుగా"

"నీవు అన్నంత తేలికగా ఎవరు చేసుకుంటారన్నయ్యా! సహృదయంతో ఆమెను స్వీకరిస్తే అంతకన్నా ఆమెకు కావలసిందేముంది?"

రవీంద్ర కళ్ళముందు శారద రూపం కనిపించిది. ఎప్పుడూ నవ్వుతూ ఆనందంగా గడప వలసిన సమయంలో ఆమె జీవితం ఇలా అయినందుకు అతను ఎంతో బాధపడ్డాడు...ఇంతవరకు తనుచేసిన అన్వేషణ ఈ నాటికి పూర్తి అయింది అనుకున్నాడు. తను త్యాగం చేయడం కాకపోయినా ఆమె జీవితానికి ఒక బాట తనవలన ఏర్పడి ఆ బాటలో పల్లెలు విక

శించాలని తలపోసేడు. అందుకే విజయ దగ్గరకు నెమ్మదిగా వచ్చి అన్నాడు...'విజయా! ఆ పని నేనే చేస్తే!'

"అన్నయ్యా!" అంది విజయ ఆనందంతో.

బయట నిలబడివున్న 'శారద' హృదయంలో కోటి వీణలు ఒకేసారి మ్రోగినట్లయింది. ఎన్నో వేల మల్లెపువ్వులు విరబూచినట్లయింది. కాని ఆమె హృదయం 'వద్దు రవీ! ఈ అభాగ్యురాలి గురించి నీ జీవితాన్ని నాశనంచేసుకోవద్దు' అని మూగగా అరిచింది.

విజయ మెల్లిగా అంటోంది 'నీవు ఆమెను చూసి జాలి పడుతున్నావా అన్నయ్యా?

"జాలికాదు విజయా! చిన్నతనంలోనాకాటోయే హృదయదేవత ఎలావుండాలో నీకు చెప్పేవాడినిగా, గుర్తులేదా? మొదటిసారిగా ఆమెనుచూడగానే, ఎన్నో జన్మల అనుబంధం మామధ్య వుంది అనిపించింది... ఆ బంధాన్ని ఇంకా దగ్గర చేసుకోవాలనిపించే నిన్ను అడిగేను.... ఇంతవరకు ఆమె జీవితం "ముళ్ళ బాట కావచ్చు... కాని నావలన ఆ బాటలోనే ఆమెకు మల్లె పువ్వులు దొరికితే నేనెంతో ధన్యుడిని."

"అన్నయ్యా" ఆనందంతో అతని చేతులు పట్టుకుంది. నిన్ను చూసి నేను గర్వపడుతున్నాను. కాని ఈ విషయంలో అమ్మ, నాన్న ఏమంటారో?

'విజయా ఈ విషయంలో అమ్మా నాన్నలను ఒప్పించే పూచినాది... ముందుగా ఆమెనుండి మనం కనుక్కోవడం మంచిది. ప్రశాంత సమయంలో ఆమె మనస్సు గాయపడకుండా నీవు అడుగు'...

'లేదన్నయ్యా జీవితాంతం నిన్నుతన గుండెల్లో పెట్టుకొని పూజించుకుంటుంది ఆమె మనస్సు నాకు తెలుసు. స్నేహమే కాకుండా దీనివలన మా ఇద్దరి మధ్య మరో అనుబంధం కూడా ఏర్పడుతుంది'.

"సరే! ఈ రాత్రికి నేను వెళ్ళిపోతున్నాను. నీవు నెమ్మదిగా తెలుసుకొని ఉత్తరం వ్రాయి. ఒక స్నేహితుడ్ని కలుసుకొని రావాలి నేను అలా వెళ్ళి వస్తాను' అని అతను బయటకు వస్తుంటే శారద ప్రక్కకు తప్పుకుంది.

*　　　*　　　*

ఆనాటి రాత్రి...

మంచుకురుస్తున్న వెన్నెలరాత్రి. వెన్నెల వెలుగులో వికశించిన మల్లెపువ్వులపై మంచుబిందువులు పడి ముత్యాల్లా మెరస్తున్నాయి.

సన్నగా గాలివీస్తుంటే గుమ్మానికి కట్టిన నీలి రంగు తెరలు నిమ్మదిగా వూగుతున్నాయి.

ఆరుబయట కుర్చీలో కూర్చొని ఆకాశంలోని తారా-చంద్రుల అన్యోన్యతను చూస్తోంది 'శారద'.

స్టేషన్‌కువెళ్ళి 'రవీంద్ర'ను సాగనంపివచ్చింది 'విజయ.'

"శారదా!" దగ్గరకువస్తూ పిలిచింది విజయ. "ఇలావచ్చికూర్చో ఏమిటి ఆలోచిస్తున్నావు?" అంది మెట్లప్రక్కగా వున్న అరుగుమీద కూర్చొంటూ.

'మీఅన్నయ్య వెళ్ళిపోయేరా!' ప్రక్కకువచ్చి కూర్చొని అడిగింది.

'వెళ్ళిపోయేరా అంటున్నావు. వెళ్లడం నీ కిష్టం లేదా?' అంది చిన్నగానవ్వి.

సిగ్గుతో మాట్లాడలేక తలవంచుకొంది శారద.

'శారదా! నీదగ్గర నాకు ఎంతో చనువు వుంది. అదేచనువుతో నేను ఒకటి అడగనా?'...

'అదేమిటో నాకు తెలుసు విజయా!... కాని...'

'అంటే ఈవేళ ఉదయం మాఅన్నయ్య, నేను మాట్లాడుకోవడం విన్నావా?'

'అంతావిన్నాను విజయా!... అంతఅదృష్టానికి నోచుకోలేని అభాగ్యురాలిని'... అంది విజయఒడిలో తలదాచుకొంటూ.

ప్రేమగా ఆమెతల నిమురుతూ "శారదా! ఎందుకు అంత బాధపడతావు. ఎప్పుడో జరిగినదానికి

జీవితాంతం ఇలాగే బాధపడుతూ కూర్చొంటావా?... నామాటవిను శారూ! ఈలోకంలో ఒంటరిగా బ్రతకడం కష్టం. వివాహానికి ఎదురీదలేం... నాకోరిక కాదనకు...' అంది.

"ఎందుకువిజయా! నామీద నీకింతజాలి, నన్ను ఇలా బ్రతకనివ్వవా?" అంది కన్నీటికళ్ళతో.

"జాలికాదు శారదా!... నీజీవితంలో వెన్నెల కురవాలి. అందుకే నా తాపత్రయమంతా! సహృదయంతో నాఅన్నయ్యే నిన్ను స్వీకరిస్తానంటే ఆ గర్వం నాదికాదూ!... స్నేహితురాళ్ళమే గాకుండా మనిద్దరిమధ్య శాశ్వతమైన అనుబంధం నిలవాలి."

"శారద" మనస్సులో ఎంతోవేగంగా ఆలోచిస్తోంది. అమ్మమ్మతప్పించి ఈలోకంలో తరవాత తనకు ఎవరున్నారు? ఆమెకూడాపోతే తను మరలా ఒంటరిగానే వుండిపోవాలి... ఈచదువుఅయిన తనకు ఏమిచేయాలో తెలియకుండావుంది. ఈ విలువైన క్షణాలు జారవిడచుకుంటే, తనకు ముందంతా చీకటే తప్పించి మరేమి వుండదు...

అందుకే నెమ్మదిగాఅంది "నన్ను కొంత ఆలోచించుకోని విజయా! నీకంటే నాకు ఎవరున్నారు అప్తులు?"

విజయ ఆమె ముంగురులను నవరిస్తూ "నీఇష్టం వచ్చినంతసేపు ఆలోచించుకో శారదా!... ఇక లోపలకు పోదాంపద, మంచుకురుస్తోంది" అంది.

ఇద్దరూ ఒకరిచెయ్యి ఒకరు పుచ్చుకొని లోపలకు వెళ్ళారు.

*　*　*

పదిరోజులుపోయేక 'విజయ' పరిగెత్తినట్టుగానే వచ్చి "శారదా మాఅన్నయ్యఉత్తరంవ్రాసేడు"అంది.

"ఏమని?" అంది కంగారుగా.

"దేనికమ్మా అంత కంగారు. ఇదిగో నీవే చదువుకో" అని ఆమెచేతుల్లోపెట్టి వెళ్ళిపోయింది.

వణుకుతున్న చేతులతో మెల్లిగా ఉత్తరాన్ని విప్పింది.

'శారదా!'

"విజయ" దార్వా నీకథ విన్నతరువాత అది నాబ్రతుకులో మరోమలుపు తిప్పింది. నవవసంతాలు కురవవలసిన నమయంలో ఎండమావులు ఏర్పడితే జీవితానికి అర్థం ఏముంది? మొదటిసారిగా నిన్ను చూడగానే, ఇన్నాళ్ళు నేను అన్వేషిస్తున్న దేవతవు నీవే అని ఎలాచెప్పగలను? శారదా: నీ అంగీకారం రాగానే నేనెంత ఆనందించేనో నీకు ఎలా వ్రాయగలను. మలుపుతిరిగిన మనజీవితాలలో మరో పూల తోటను నిర్మించుకొని అందులో హాయిగా గడుపుదాం.

అమ్మ; నాన్న నిన్ను చూడటానికి త్వరలోనే అక్కడకు వస్తున్నారు. ముందు నీచదువు పూర్తి చేయి. ఇంకా ఎన్నాళ్ళు రెండునెలలేకదూ.

ఉత్తరంవ్రాయి. ఎదురుచూస్తూ :

నీ రవీంద్ర.'

అఉత్తరం చదవగానే అనిర్వచనీయమైన మధురానుభూతిపొందింది. ఆమె...ఆనందంతో తన మనస్సులో అతనికి జోహార్లు అర్పించింది. ఎటుచూచినా ఆమెకు వెన్నెలమయమై కనిపించింది. రవీ! నేనెంత అదృష్టవంతురాల్ని... అప్పటినుంచి తన హృదయంలో అతన్ని ఆరాధిస్తూ వచ్చింది. ఈ విషయం ఆమె తన అమ్మమ్మకు చెప్పగానే ఎంతో ఆనందించింది. మరలా తనజీవితం చిగురుస్తున్నందుకు ఆనందంతో ఆమెకళ్ళు వర్షించేయి. తనను హృదయపూర్వకంగా దీవించింది.

*　*　*

యమ్.ఏ. ఫైనల్ పరీక్షలు ఆనాటితో పూర్తి అయ్యేయి. విజయ, శారద పోటీలుపడి చదివి, కష్టపడి వ్రాశేరు. పరీక్షలముందే విజయకుకూడా ఆమె

బావతో సంబంధం కుదిరింది. రెండు పెళ్ళిళ్ళు ఒకే సారి చేయాలని నిర్ణయించుకున్నారు...

'విజయ' ఆనాడే వాళ్ళవూరు వెళ్లడానికి అన్నీ సర్దుకుంటూంది... శారదకూడా దగ్గరవుండి అన్నీ అందిస్తోంది.

"వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తావుకదూ!"

"ఆహా! వ్రాయకుండా వుంటే నీవు వూరుకుంటావా? కాబోయే వదినగారివికూడా" అంది నవ్వుతూ.

"ఛీ! పో! అన్నీ చిలిపిమాటలు" అంది శారద.

"విజయా! నాకన్నాచిన్నదానివైనా నీఆత్మీయతకు, సహృదయానికి నేనెలా కృతజ్ఞతలు తెలుపుకోవాలో అర్థంకాదు. నీలాంటిస్నేహితురాలు దొరకడం నా అదృష్టం" అంది.

"ఇదిగో అమ్మాయి... సారీ వదినా! కృతజ్ఞత అంటూ పెద్దపదాలు ఉపయోగించవద్దు... గాని... మాఅన్నయ్య కేమన్నాచెప్పాలా? త్వరగాచెప్పు మరి" అంది విజయదగ్గరకు వస్తూ,

శారద సిగ్గుతో తలవంచుకొంది...

"శారూ! ఈరాత్రే నేను వెళ్ళిపోతాను. ఇంటి దగ్గర చూస్తుంటారు. నేను వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తానుగా" అంది.

ఆరాత్రే 'విజయ' వెళ్ళిపోయింది... ఆమెవెళ్ళిన తరువాత వ్రాసిన మొదటిఉత్తరమే ఇది. ఇటువంటి వార్త వినవలసి వస్తుందని తాను కలలోకూడా అనుకోలేదు.

* * *

మర్నాడు... 'శారద' విజయ వాళ్ళ వూరు చేరుకుంది.

కిటికీదగ్గరగా మంచంమీద కూర్చొని శూన్యంలోకి చూస్తున్నాడు 'రవీంద్ర'. కాని అతనికి అంతా చీకటిగానే కనిపిస్తోంది...

దూరంగా మాటలు వినిపిస్తుంటే 'విజయా! ఎవరమ్మా వచ్చింది?' అంటూ ఇటుతిరిగేడు.

'విజయ' రాబోతున్న దుఃఖాన్ని దిగమ్రింగి, నీవే దగ్గరకువెళ్ళు అన్నట్టు 'శారద'కు సూచించి తను ప్రక్కకు తప్పుకుంది.

ఆస్థితిలోవున్న 'రవీంద్ర'ను చూడగానే ఆమెలోని దుఃఖం కట్టలుత్రెంచుకుంది. పరుగెత్తుకొనివెళ్ళి అతని ఒడిలో వాలింది.

ఆమెను పొదివిపట్టుకుంటూ 'విజయా? ఎందుకమ్మా అలా అస్తమాను ఏడుస్తావు ఈ అన్నయ్య గురించి, ఏడ్చినంతమాత్రాన పోయినకళ్ళు తిరిగి వస్తాయా! నీ అన్నయ్యది దురదృష్ట జీవితమమ్మా' అంటున్నాడు ఆమెమోహాన్ని తడుముతూ

"నేనండి శారదను" ఆతరువాత ఆమె మాట్లాడలేకపోయింది.

"శారదా! నీవా!" అన్నాడు ఆశ్చర్యంగా, "ఎప్పుడొచ్చావు శారదా!" అన్నాడు.

"ఇప్పుడేనండి! విజయవ్రాసిన ఉత్తరం నిన్ననే అందినది, రెక్కలుకట్టుకొని వచ్చాను."

"నేను దురదృష్టవంతుడ్ని శారదా! నిన్ను మరోసారి చూసే అదృష్టానికి నేను నోచుకోలేదు" అన్నాడు బొంగురుపోయిన కంఠంతో.

"అంత మాటనకండీ... ఆమాటంటే నేను బ్రతకలేను. ఇప్పుడే మీ పాదాలముందు తల కొట్టుకొని చచ్చిపోతాను" అంది ఏడుస్తూ

కన్నీళ్ల అతని చేతిమీద పడుతుంటే "వూరుకో శారదా! మనజీవితాలలో తీరని అన్యాయం జరిగిపోయింది. మనం నిర్మించుకున్న ఆశాసౌధాలన్నీ నేలకూలేయి"...

"లేదండీ! మీకు నేను వున్నాను... మీరు నా కళ్ళతో ఈ లోకాన్ని చూడగలరు."

"ఈ అభాగ్యుడి గురించి నీజీవితాన్ని బలిచేసుకుంటావా? వద్దు శారదా!"

"రవీ;... మీజీవితాన్ని నాకు అంకితం చేసినప్పుడు, ఇప్పుడు నన్నునేను మీకర్పించుకోవడంలో తప్పేముంది? కాదనకండి! మిమల్ని విడిచి ఒకక్షణం కూడా బ్రతకలేను. నాకీ అదృష్టం కల్పించండి చాలు. ఇంతకన్నా మీనుండి ఎక్కువ నేనేమీకోరను."

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచేయి.

"అదృష్టవంతుడ్ని శారదా! దూరమైపోతాయనుకున్న మనజీవితాలు భగవంతుడు ఇలా కలిపేడు" అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

అపురూపంగా అతని హృదయంమీద వ్రాలింది శారద.

గోడవారగా విరబూచిన మల్లెపువ్వులు మత్తుగా వికసించిపరిమళాలు వెదజల్లుతున్నాయి. ఆపరిమళాలే గాలిలో తేలివచ్చి ఆ గదినంతా నింపివేశాయి.

*With best compliments from :*

Grams : 'NOTABLE' Phone : 74334

H. O. : BANGALORE Branch : MADRAS

**A. Ahmedally & Co. (Private) Ltd.**

Post Box No. 1555

**5-1-447 to 449, Ranigunj, Secunderabad-3.**